క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

చింతూరు: మండల కేంద్రంలోని విఘ్నేశ్వర దత్తాత్రేయ సహిత షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడ హారతి, పంచామృత అభిషేకాలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, సర్వతో భద్రమండల ఆరాధన, లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సంధ్యాహారతి, పల్లకి ఉత్సవ ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో గంగమ్మతల్లికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలకు వారం రోజుల ముందు నుంచి విగ్రహ అభిషేకం అనంతరం ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం ఆలయంలో గంగమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలను జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామంలో విగ్రహాల ఊరేగింపు చేసి ప్రతి ఇంటి వద్ద పూజలు నిర్వహించారు. సర్పంచ్ వెంగడ రమేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి మోహన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో టీడీడీ ఆధ్వర్యంలో సీతారామ ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో రూ.16 లక్షలతో ఆలయాన్ని నిర్మించేందుకు టీటీడీ నిధులు మంజూరు చేసింది. గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించారు. దీంతో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరిప్రసాద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వీరోజి త్రిమూర్తులు, పూజారి బాలరాజు, లక్ష్మీపడాల్, వీరయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో అమ్మవారి ఉత్సవాలు



గంగమ్మతల్లి పాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నర్సమ్మ, గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని పాతసుజనకోట గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి పండుగను పురస్కరించుకొని అమ్మవారి పేరిట పాకెట్ క్యాలెండర్‌ను సోమవారం తహసీల్దార్ నర్సమ్మ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ నెల 20, 21 తేదీల్లో అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సుజనకోట గ్రామానికి చెందిన వైజాగ్ హిందుస్థాన్ షిపియార్డు ఉద్యోగి సమరెడ్డి బాలగంగాధర్ తిలక్ ఏటా అమ్మవారి పేరిట పాకెట్ క్యాలెండర్‌ను ముద్రించి భక్తులకు అందిస్తున్నారు. ఆయనను పలువురు అభినందించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, మోహన్ ,ఆర్ఐ నానిబాబు, గ్రామస్తులు ధర్మారావు, నానిబాబు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో పెదబరడ పంచాయతీ కృష్ణపురంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపీపీ కోరాబు అనూషదేవి సోమవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం పాఠశాలలో మెను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెరుగైన విద్య బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

తీరిన వెతలు



అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ

- అరకు ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో, స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో అనంతగిరిలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు
- విద్యార్థులకు తప్పిన ప్రయాస
- విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం

అనంతగిరి: పరీక్ష కేంద్రం ఏర్పాటుతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు పెనూ భారం తప్పింది. మండల కేంద్రంలో 2002లో ప్రభుత్వ జూనియర్ ఏర్పాటైంది. అప్పటి నుంచి కళాశాలలోనే ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం ఉండేది. అయితే 2018లోని వివిధ కారణాలతో పరీక్ష కేంద్రాన్ని అరకులోయకు మార్పుచేశారు. దీంతో విద్యార్థులు సుమారు 30 కిలోమీటర్లు ప్రయాణించి అరకులోయలో కేంద్రానికి పరీక్షకు హాజరయ్యేవారు. అనంతగిరి కళాశాలలోని యథావిధిగా పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళన రాస్తారోకో చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతుతో విద్యార్థులు పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తూనే అరకులోయకు వెళ్లి పరీక్షలు రాసేవారు. ఎట్టకేలకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైంది. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ చొరవ...ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ దీసరి గంగరాజు తదితరుల కృషితో ఈ ఏడాది పరీక్ష కేంద్రాన్ని ఉన్నతాధికారులు మంజూరు చేశారు. దీనిపై విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం 100 మంది , ద్వితీయ సంవత్సరం 117 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటుతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పరీక్ష కేంద్రంలో అన్ని సదుపాయాలు



యంత్రాంగం ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే పరీక్ష జరుగుతాయి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పన కృషిచేసి, ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– సునంద, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల, అనంతగిరి 13ఎఆర్‌కే02ఎ.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- మండల పరిషత్ బడ్జెట్ సమావేశంలో ప్రజా సమస్యలపై గళం విప్పిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, చిత్రంలో జెడ్పీటీసీ బేబీరత్నం తదితరులు

గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ బడ్జెట్ సమావేశం సోమవారం జరిగింది. పలు ప్రజా సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. ఎండపల్లి, కొత్తాడ, మొల్లేరులో తాగునీటి సమస్యను సర్పంచ్‌లు రామలక్ష్మి, కుంజం లక్ష్మి, కామరాజుదొర వివరించారు. దీనిపై ఎంపీడీవో బి.శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దటి నివారణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. బోర్లు, మంచి నీటి ట్యాంక్‌లు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పాటు మండల పరిషత్ నిధులు వినియోగిస్తున్నట్టు చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న కార్యక్రమాలను ఎంపీపీ సమీక్షించారు. వ్యవసాయ శాఖ, నీటి పారుదల శాఖల, పశు సంవర్ధక శాఖ, విద్యాశాఖలపై సమీక్ష జరగగా మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్ పలు అంశాలును సమావేశం దృష్టికి తెచ్చారు. సూరంపాలెం రిజర్వాయర్ ద్వారా రబీ సీజన్‌కు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పశు బందీళ్లదొడ్లు ఏర్పాటుకు, ఏజన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణాలు పూర్తి చేసుకున్న సుమారు 700మంది లబ్ధిదారులకు రెండు దఫాలుగా ఆ సొమ్ము లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీలు రామతులసి, కుంజం గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు పండా ఆదినారాయణ, వెంకటలక్ష్మి, కనకలక్ష్మి, పద్మావతి, ఐసీడీఎస్ సీడీపీఓ సిహెచ్.లక్ష్మి, వ్యవసాయాధికారి విశ్వనాథ్, ఎంఈఓ మల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్‌లు ఏఈ శివప్రసాద్, అబ్బాయిదొర, పీఆర్ జేఈ రమణ, పిహెచ్‌సీ వైద్యాధికారులు భావన, కివీస్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల బడ్జెట్ వివరాలు

- మండల పరిషత్ సవరణ బడ్జెట్ అంచనాలు రూ 19,08,300 కాగా 2023-24 బడ్జెట్ అంచనా ఆదాయం రూ 19,57,100 మిగులు రూ .50,200 గా చూపించారు. ఉపాధి హామీ పథకం 2022-23 సవరణ బడ్జెట్, అంచనా బడ్జెట్ రూ 4.65 కోట్లు ఆదాయ వ్యయంగా చూపించారు.
- సమాజాభివృద్ధి బడ్జెట్ 2022-23లో రూ.1,04,40,000 గాను, అంచనా బడ్జెట్ 2023-24 రూ.1,14,40,000లుగా చూపించారు.
- 2023-24 బడ్జెట్ అన్ని పనుల ఆదాయం రూ.14,87,37,300, వ్యయం రూ.14,86,87,100కాగా, రూ.50,200 మిగులు బడ్జెట్ ఉన్నట్టు ఎంపీడీవో వివరించారు.

జీడి, మామిడి తోటలకు వేలం

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట పంచాయతీ పోతుకొండ గ్రామంలో మామిడి, జీడిమామిడి చెట్లు ఫలసాయం పొందేందుకు ఈనెల 24న వేలం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. సర్వే 234/1లో 3హెక్టార్ల 30 ఎర్లు విస్తీర్ణంలో మామిడి చెట్లు, జీడిమామిడి చెట్లు ఫలసాయం అనుభవించు హక్కు కోసం వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు, వ్యాపారస్తులు పాల్గొనాలని తెలిపారు. ఎం.రావిలంక గ్రామంలో ప్రభుత్వం భూమిలో మామిడి తోట వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 6ఎకరాల 55సెంట్లు విస్తీర్ణంలో గల మామిడితోటలో ఫలసాయం అనుభవించే హక్కు పొందేందుకు ఈ నెల 17న తోట వద్ద ఉదయం 11 వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొవాలని తెలిపారు.

యువతకు ఉపాధి కల్పనకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

రంపచోడవరం: మండల కేంద్రంలోని చెలకవీధిలో జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ సంఘం సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథులుగా వ్యవస్థాపకులు రెవరెండ్ బిషప్ స్టిఫెన్ పాల్గొన్నారు. 50 మంది పాస్టర్లు పాల్గొన్నారు. సమావేశంలో సంఘం తరపున యువతకు ఉపాధి కల్పనకు చర్యలు, సేవా కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. సంఘం ప్రతినిధులు హేన్సన్‌బాబు, జోసఫ్‌పాల్, చంద్రపాల్, సాల్మన్, నతానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు



బంగారుమెట్టలో సంక్షేమ పథకాల స్టిక్కర్ అందిస్తున్న ఎంపీటీసీ కొండమ్మ, గృహసారథులు, కన్వీనర్లు

ముంచంగిపుట్టు: ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బంగారుమెట్ట ఎంపీటీసీ సభ్యురాలు చెండా కొండమ్మ అన్నారు. మండలంలో గల బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎంపీటీసీ కొండమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సోమవారం పర్యటించారు. సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల స్టిక్కర్లు కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ కొండమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏజెన్సీ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. కన్వీనర్లు జగన్నాథం, వరలక్ష్మీ, గృహసారథులు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 17 వరకు 'గడప గడపకు' వాయిదా



చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

అనంతగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు ఉండడంతో మార్చి 17వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వాయిదా వేసినట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఒక ప్రకటనలో తెలిపారు. అరకు నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు గమనించాల్సిందిగా కోరారు. ఎమ్మెల్సీ ఫలితాల అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

శివరాత్రి ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్ : అనకాపల్లి గవరపాలెంలో ప్రసిద్ధి చెందిన భోగలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 18న మహాశివరాత్రి ఉత్సవాలు భారీగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ పురోహితులు నారాయణరావు, హరి, చిన్నిల ఆధ్వర్యంలోజరిగే పూజా కార్యక్రమాలను వీక్షించడానికి భక్తులకు సకల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

ఇంటర్ పరీక్షలకు విద్యార్థుల హాజరు తప్పనిసరి

చింతూరు: స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించే పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘురాం సోమవారం తెలిపారు. ఈ నెల 15న మధ్యాహ్నం ఒంటి గంటకు నైతిక విలువలు, మానవతా విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్) పరీక్ష, 17న పర్యావరణ విద్య (ఎన్విరాన్మెంటల్ స్టడీస్) పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ రెండు పరీక్షల కోసం ఈ ఏడాది 142 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, గతేడాది ఈ పరీక్షలు రాయని విద్యార్థులు, ఫెయిల్ అయిన వారు కూడా పరీక్షలు రాసేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అవకాశం కల్పించిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజవొమ్మంగి: ఈనెల 15, 16 తేదీల్లో జరిగే ఫస్ట్ ఇంటర్మీడియేట్ పరీక్షలకు విద్యార్థులు తప్పకుండా హాజరుకావాలని రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ షేక్ మదీన్ కోరారు. ఈ రెండు పరీక్షలకు హాజరు కాకపోతే మార్చిలో జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అనర్హులు అవుతారని తెలిపారు. 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నైతిక-మానవ విలువలు అంశంపై, 17న ఉదయం 10 గంటలకు పర్యావరణ విద్యపై పరీక్షలు ఉంటాయన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 160 మంది, గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 119 మంది, ఇటీవల నూతనంగా ప్రారంభమైన టెన్‌ప్లస్ కళాశాలలో 25 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

అంచనాల వారీగా ఉపాధి పనులు



ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో అడ్డతీగల ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఉపాధి హామీ మండల క్లస్టర్ ఏడీ బాపన్నదొర సోమవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో ప్రజా అంచనాల వారీగా పనులు చేపట్టాలన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి రోజు 5 వేల మంది కూలీలు పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల వారీగా పనులు, డిమాండ్ వివరాలను చర్చించారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిదినాలు వర్తించేలా ప్రోత్సహించి పనులు చేయించాలన్నారు. నిర్ణయించిన మేరకు పనిదినాలు, వేతనాలు వచ్చేలా చూడాలన్నారు. ప్రతిపాదనల తయారీతో పాటు మండల ప్లాన్ నివేదిక సమర్పించాలన్నారు. గ్రామ పంచాయితీ తీర్మానాలు తప్పనిసరి అన్నారు. జాబ్‌కార్డుల అప్‌డేట్, ఆధార్ అనుసంధానం చేయించాలని సూచించారు. పనుల వారీగా పరిశీలన చేస్తూనే వాటికి సంబంధించి ఫోటోలు పంపించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఏపీవో మణికుమారి, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తలశిల రఘురామ్‌కు పరామర్శ



భార్య మృతితో విషాదంలో ఉన్న ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్‌ను ఉప ముఖ్యమంత్రి పీడక రాజన్నదొర, అరకులోయ, పాడేరు, పార్వతీపురం ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అలజంగి జోగారావు సోమవారం పరామర్శించారు. విజయవాడలోని ఆయన స్వగృహంలో తలశిల కృష్ణకుమారి చిత్రపటానికి వారు నివాళులర్పించారు.

-సాక్షి, పాడేరు

శరభవరంలో తాగునీటి సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..



మోటారుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: శరభవరం గ్రామంలో రెండు రక్షిత మంచినీటి పథకాలు మూలకు చేరడంతో తాగునీటి సమస్య తలెత్తింది. దీనిపై సోమవారం ‘సాక్షి’లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. స్థానిక ఎంపీడీఓ బాపన్నదొర ఆదేశాల మేరకు సచివాలయ కార్యదర్శి కిషోర్ మోటారు మరమ్మతు పనులు చేయించారు. సోమవారం పూర్తిగా మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని కిషోర్ తెలిపారు. అదే విధంగా కొత్త మోటారు కొనుగోలు చేశామన్నారు. కాగా మరో రక్షిత మంచి నీటి పథకానికి చెంది బోరులో నీరు అడుగంటిందన్నారు. మంగళవారం ఈ బోరు బావిలో ఫ్లషింగ్ పనులు చేపట్టి నీరు వచ్చేలా చర్యలు తీసుకొంటామన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం



గంగరాజుపుట్టు గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం తదితరులు

హుకుంపేట: మండలంలోని భీమవరం పంచాయతీ గంగరాజుపుట్టు గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం పర్యటించారు. గ్రామ సమస్యలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతీ ఇంట సంక్షేమ పథకాల పంట అని అభివర్ణించారు. గిరిజన గ్రామలభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నైని సత్తిబాబు, సర్పంచ్ సన్నిబాబు, వెంకటరావు, ఎంపిటీసీలు సాంభ,సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ

రోలుగుంట: మండలంలో రోలుగుంట, కొండపాలెం, తదితర గ్రామాల్లో అడవిరాజులబాబు పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆలయాలకు భక్తులు వేకువజాము నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. దీనిలో భాగంగా కొండపాలెంలో బంటు వారి కళ్లాల వద్ద గుడిలో మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బంటు పరదేసినాయుడు దంపతులు, రోలుగుంట పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కర్రి వీరునాయుడు పూజలు చేశారు. ఇక్కడ, రోలుగుంటలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నర్సీపట్నం: కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర ఆధ్వర్యంలో పెదబొడ్డేపల్లిలో అడవిరాజులబాబు పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు రాజులబాబును దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బలిఘట్టంలో ఈ పండగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ధర్మసాగరంలో రాజులబాబును దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సర్పంచ్ గొంప కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిడతలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కుష్టు వ్యాధిపై విస్తృతంగా అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శశికాంత్



రాజవొమ్మంగి అల్లూరి కూడలి వద్ద కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీలో విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది

జి.మాడుగుల: మండల కేంద్రంలోని గురుకులం పాఠశాలను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి మైక్రో బాక్టీరియా ద్వారా వస్తుందని ఈ క్రిములు తుమ్మటం, దగ్గడం వలన వ్యాప్తి చెందుతాయన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు వంటి వ్యాధి లక్షణాలు కన్పిస్తే తక్షణమే ఆస్పత్రిల్లో పరీక్షలు చేయించుకోని తగిన వైద్యం పొందాలని ఆయన సూచించారు. ఎంపీహెచ్ఈవో ఎస్.ప్రకాష్, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తు రాజవొమ్మంగి పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి కుష్టు నివారణపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యాధికారి లిఖిత మాట్లాడుతూ

శరీరంపై రాగి రంగులో స్పర్శ, దురద లేని మచ్చలు గమనిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్టు వ్యాధిని మందుల వినియోగంతో తగ్గించుకోవచ్చన్నారు. నాగవాసు, రమాబాయి, హెల్త్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వరినాట్లు ప్రారంభం



వరి నారు తీస్తున్న గిరిజన మహిళలు

డుంబ్రిగుడ: మండలంలోని రబీ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. కుజ్జభంగి ,రంగిలిసింగి, జాముగుడ, గుంటసీమ, దొర్రగుడ, కుట్టి, సోబురు, గేదెలబంద, డొమంగి, గుంటగన్నెల తదితర గ్రామాల్లో వరి సాగు పనుల్లో గిరిరైతులు నిమగ్నమయ్యారు. గత ఏడాది కంటే ఈ ఏడాదిలో ఎక్కువ విస్తీర్ణంలో వరినాట్లును వేస్తున్నారు. మండల వ్యాప్తంగా గతంలో 470 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి సాగు చేపట్టగా, ప్రస్తుతం 550 ఎకరాలకు పైగా పండిస్తున్నట్టు తెలిసింది. మండల పరిధిలోని సుమారు 20 శాతం రబీ వరినాట్లు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.